

తగరపు
సిపాయి









అనగా, అనగా తగరంతో వస్తువులు చేసే ఒక వ్యక్తి చిన్న చిన్న సిపాయిల బొమ్మలు చేశాడు. ఆ సైనికులు తిన్నగా నిలబడి, భుజం మీద తుపాకీతో ఉండేవారు. వాళ్లకి నీలి రంగు ప్యాంటు, ఎఱ్ర రంగు కోటు ఉన్నాయి. నల్లటి పొడవాటి టోపీకి బంగారు రంగు బిళ్ల ఉంది. చివరి సిపాయిని చేసేటప్పటికి తగరం చాలకపోవటంతో అతడికి ఒక్క కాలే వచ్చింది.

ఆ వ్యక్తి తన సిపాయిలను బొమ్మల దుకాణానికి ఇచ్చాడు. ఒక పిల్లవాడి పుట్టిన రోజు కానుకగా ఆ సిపాయిలను కొనుక్కున్నారు. అన్న, చెల్లి సమక్షంలో పుట్టినరోజు అబ్బాయి ఆ బహుమతిని విప్పదీశాడు. అతడు బయటకు తీసిన మొట్టమొదటి బొమ్మ ఒంటికాలు సిపాయి.

ఒక కాగితపు మహలుకు ఎదురుగా తాను ఉన్నట్టు ఒంటికాలి సిపాయి గుర్తించాడు. మహలు చుట్టూ ఉన్న అద్దపు సరస్సులో హంసలు ఈదుతూ ఉన్నాయి. ద్వారానికి ఎదురుగా ఉన్న కాగితపు బొమ్మ నర్తకి సిపాయికి ఎంతో నచ్చింది. ఆమె లేత గులాబీ రంగు గౌను వేసుకుంది. నీలిరంగు వల్లెవాటు మీద మెరిసే పెద్ద బిళ్ల ఉంది. ఆమె చేతులు తల మీదకి ఉన్నాయి. ఒక కాలుని పైకి లేపి వెనక్కి పెట్టుకోవటం వల్ల చూడటానికి ఆమెకి ఒక్క కాలే ఉన్నట్టు ఉంది.

తన లాగే ఆమెకి కూడా ఒక కాలే ఉందనుకుని ఆమె ప్రేమలో పడ్డాడు సైనికుడు. “ఆమె నాకు తగిన జోడీ,” అనుకున్నాడు.





ఆ రాత్రి అందరూ నిద్రపోయిన తరవాత బొమ్మలు తమ ఆటలు మొదలుపెట్టాయి- అవి పరిగెత్తుతున్నాయి, గెంతుతున్నాయి, పిల్లిమొగ్గలు వేస్తున్నాయి. తగరపు సైనికుడు, నర్తకి మాత్రమే కదలకుండా ఉండి ఒకరినొకరు చూసుకుంటున్నారు.

ఉన్నట్టుండి గడియారం పన్నెండు గంటలు కొట్టింది! అప్పుడు జాక్-ఇన్-ద-బాక్స్ తెరుచుకుని దాంట్లోంచి ఒక గూని రాక్షసుడు బయటకు వచ్చాడు.

“తగరపు సైనికుడా, ఆ అమ్మాయిని చూడకు!” అంటూ ఆ గూని రాక్షసుడు అరిచాడు. కానీ సైనికుడు మాత్రం రెప్ప ఆర్పకుండా ఆ అమ్మాయినే చూస్తూ ఉన్నాడు. “సరే, నీ సంగతి రేపు చూస్తాను!” అంటూ గూని రాక్షసుడు గర్జించాడు.





మరుసటి రోజు ఉదయం పిల్లవాడు కొంచెం సేపు తగరపు సైనికుడితో ఆడుకున్నాడు. తెరిచి ఉన్న కిటికీ గట్టు మీద దానిని ఉంచాడు. గాలి కారణంగానో, గూని రాక్షసుడు కారణంగానో తెలియదు కాని తగరపు సైనికుడు కిటికీ లోంచి బయటకు ఎగిరి కింద పడిపోయాడు. చిన్న పిల్లవాడు పరిగెత్తుకుంటూ వచ్చి కిటికీ లోంచి బయటకు చూశాడు. మూడవ అంతస్తులో ఉన్న అతడికి కింద ఏమీ కనిపించలేదు.

“కిందకి వెళ్లి నా తగరపు సైనికుడిని తెచ్చుకుంటాను,” అని చిన్న పిల్లవాడు ఆయాని అడిగాడు. కానీ, ఆపాటికి జోరుగా వర్షం మొదలు కావటంతో ఆయా అందుకు అనుమతించలేదు.






కిటికీ తలుపు వేసేసింది ఆయా. కిటికీ అద్దం లోంచి చిన్న పిల్లవాడు విచారంగా కిందకి చూస్తూ ఉన్నాడు.

కింద ఇద్దరు వీధి బాలలు వానలో ఆడుకుంటూ ఉన్నారు. రెండు రాళ్ల మధ్య అతడి తుపాకి ఇరుక్కుపోయి తగరపు సిపాయి తలకిందులుగా వాళ్లకి కనిపించాడు.



"ఇతడి కోసం పడవ తయారు చేద్దాం!" అంటూ ఆ పిల్లలు అరిచారు. రోడ్డు పక్కన మురుగు కాలవలో వాన నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒక పాత దినపత్రికతో ఒక పడవ తయారు చేసి, అందులో తగరపు సైనికుడిని పెట్టి కాలవ నీటిలో వదిలి పెట్టారు.



పడవ వేగంగా నీటిలో వెళుతోంది. తగరపు సైనికుడు నిటారుగా నిలబడి ముందుకి చూస్తూ ఉన్నాడు.

“నేను ఎక్కడికి వెళుతున్నాను?” తగరపు సైనికుడు అనుకున్నాడు. “ఇదంతా ఆ గూని రాక్షసుడే చేశాడు. ఆ అందమైన నర్తకి నాతో ఉంటే ఎక్కడికి వెళ్లినా బాధపడేవాడిని కాదు.”

ఉన్నట్టుండి ఒక పెద్ద ఎలుక ఎదురుగా ప్రత్యక్షం అయ్యింది. “ఆగు! ముందు నీ పాస్‌పోర్ట్ చూపించు,” అంటూ అది అరిచింది. కానీ పడవ ఆగకుండా వేగంగా, ఇంకా వేగంగా ముందుకి వెళుతూనే ఉంది.







కాగితపు పడవ మురుగు కాలవ లోంచి నదిలోకి వెళ్లింది. అయితే, అది ఈపాటికి బాగా నానిపోయింది. అది ఎక్కువ దూరం ముందుకు వెళ్లలేదు. చివరికి అది మెల్లగా నీటిలో మునిగిపోయింది. దాని తోపాటే తగరపు సైనికుడు నిటారుగా కిందకి, కిందకి మునుగుతున్నాడు. అంతలోనే అతడిని ఒక పెద్ద చేప మింగేసింది.

“ఇక్కడ ఎంత చీకటిగా ఉంది!” అనుకున్నాడు తగరపు సైనికుడు. “నా పెట్టెలో కంటే ఇక్కడే బాగా చీకటిగా ఉంది!”



నదిలో ఈదుతూ చేప, దానితో పాటు దాని పొట్టలో ఉన్న తగరపు సైనికుడు సముద్రం చేరుకున్నారు. పిల్లలు, ఇతర బొమ్మలు, ప్రత్యేకించి అందమైన నర్తకి ఉన్న ఆ పెద్ద గది గురించి చిన్నారి సిపాయి ఆలోచిస్తూ ఉన్నాడు.

“ఆమెను నేను మళ్లీ ఎన్నటికీ కలుసుకోలేను, ఎన్నటికీ చూడలేను,” అనుకుంటూ సైనికుడు నిట్టూరా . అతడు ఎక్కడు ఉన్నాడో, అతడికి ఏమవుతోందో కూడా సిపాయికి తెలియదు. అయితే ఆ చేప అనుకోకుండా చేపలు పట్టుకునే ఒక వ్యక్తి వలలో చిక్కింది. చేపలు పట్టే వ్యక్తి వలను ఓడ మీదకి లాగి చేపలను డబ్బాలో వేశాడు.





పట్టుకున్న చేపలను అన్నింటినీ ఆ వ్యక్తి చేపల బజారులో అమ్మాడు. పెద్ద చేపతోపాటు ఇతర చేపలను వాటిని అమ్మే ఒక మహిళ కొనుక్కుంది. ఆమె వాటిని అమ్మకానికి తన దుకాణంలో ఉంచింది. కొంత సేపటికి చేపలు కొనటానికి ఎవరు వచ్చారనుకుంటున్నారు – చిన్న పిల్లవాడి ఆయా! చూడగానే ఆమెకి పెద్ద చేప నచ్చి, దానిని కొనుక్కుంది. దాని పొట్టలో తగరపు సైనికుడు ఉన్నాడని ఆమెకి తెలియదు.

చేపని వంటలామెకి ఇచ్చింది ఆయా. “చేప చాలా బాగుంది!” అని వంటలామె మెచ్చుకుంది. ఆమె చేపను కోసింది. “కానీ, దీని పొట్టలో ఏదో గట్టి వస్తువు ఉంది,” ఆమె గొణిగింది.

చేప పొట్టలోంచి బయటపడిన తగరపు సైనికుడిని చూసి వంటలామె ఆశ్చర్యపోయింది. “ఇది చిన్న బాబు పోగొట్టుకున్న సిపాయి బొమ్మ!” అంటూ ఆమె కేకపెట్టింది.



పోగొట్టుకున్న సైనికుడి బొమ్మ తిరిగి దొరికిందని తెలుసుకుని చిన్న అబ్బాయి చాలా సంతోషించాడు. ఇక తగరపు సైనికుడి విషయానికి వస్తే, చాలాసేపు చీకటిలో ఉండి చేప పొట్టలోంచి బయటపడిన తరవాత వెలుతురికి గాభరా పడిపోయాడు. తాను ఎక్కడ ఉన్నాడో కొంత సేపటి దాకా అతడికి అర్థం కాలేదు.

తగరపు సైనికుడికి బల్ల మీద బొమ్మలు, అద్దపు సరస్సు, కాగితపు మహలు కనిపించాయి. అతడికి ఎదురుగా ఆ అందమైన నర్తకి ఇంకా ఒంటికాలి మీదే నిలబడి ఉంది. అతడి దగ్గర అదనపు తగరం ఉండి ఉంటే తప్పకుండా కన్నీళ్లు కార్చి ఉండేవాడే. దానికి బదులు, నర్తకిని అతడు రెప్ప వేయకుండా చూస్తుండిపోయాడు. నర్తకి కూడా అతడినే చూస్తూ ఉంది.

అయిపోయింది



